పట్టణ ప్రగతితో మెరుగైన వసతులు



కోదాడలో పట్టణ ప్రగతి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు



హుజూర్‌నగర్‌లో పట్టణ ప్రగతి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, మున్సిపల్ పాలకవర్గం, తదితరులు

కోదాడ : పట్టణ ప్రగతి కార్యక్రమంతో మెరుగైన వసతులు కల్పించబడుతున్నాయని, పట్టణాల రూపురేఖలే మారిపోయాయని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కోదాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. కోదాడ మున్సిపాలిటీలో పెద్దచెరువు సుందరీకరణ, పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టం, క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతకు ముందు పట్టణంలో మున్సిపాలిటీ కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశిష్ట సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, కమిషనర్ మహేశ్వరరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, సమభావన సంఘాల మహిళలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి

హుజూర్‌నగర్ : ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్‌లో పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆర్‌డీఓ కార్యాలయం తెచ్చామని, త్వరలో డీఎస్‌పీ కార్యాలయం కూడా తెస్తామన్నారు. బైపాస్ రోడ్డు, పట్టణంలో రోడ్డు వెడల్పులో నిర్వాసితులు తనను క్షమించాలని వారికి ఇళ్లు ఇచ్చి తగిన న్యాయం చేస్తామన్నారు. మెయిన్ రోడ్ల వెడల్పులో పని జరగకుండా కొందరు ప్రయత్నిస్తున్నారని కొద్దో గొప్పో ఆలస్యమైనా పని చేసి చూపుతామని చెప్పారు. పట్టణం నుంచి వెళుతున్న జాతీయ రహదారి విస్తరణ విషయంలో మంత్రి కేటీఆర్, ఎంపీ బడుగుల సహకారంతో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసి రూ.30 కోట్లు అదనంగా మంజూరు చేయించి పట్టణంలో రోడ్డును సుందరంగా తయారు చేయించామని చెప్పారు. అతి తొందరలో మెయిన్‌రోడ్డును, ట్యాంక్ బండ్, పార్కును పూర్తి చేస్తామని, బోటింగ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యాలయంలో జాతీయ పతకం ఆవిష్కరించి జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా చిన్నారుల భరతనాట్యం ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. అభివృద్ధిని నాడు నేడు అనే కరపత్రం ఆవిష్కరించారు. వివిధ రంగాల లబ్ధిదారులకు రూ.50 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. కౌన్సిలర్లను, పారిశుద్ధ కార్మికులను, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని శాలువాలతో సన్మానించారు. కారక్రమంలో డీపీఓ ఎన్.యాదయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, పురపాలక సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

దేశంలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు



నేరేడుచర్లలో జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : సీఎం కేసీఆర్ దేశంలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, తొమ్మిదేళ్లల్లో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చేందిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీలో శుక్రవారం పట్టణ ప్రకృతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మూడున్నర ఏళ్లల్లో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల సహకారంతో ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పాత నేరేడుచర్లలోని డంపింగ్ యార్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే డంపింగ్ యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నెలలోపు ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. అనంతరం పట్టణ ప్రగతి నివేదిక విడుదల చేశారు. కౌన్సిలర్లు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, కొణతం సత్యనారాయణరెడ్డి, వీరయ్య, మార్కెండేయ, కౌన్సిలర్లు అలక సరితసైదిరెడ్డి, బాణోతు లలితాభారత్, సరిత, బాషా, శహనాజ్, సుగుణ, సులోచన, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాస్‌లు పంపిణీకి సిద్ధం

కోదాడఅర్బన్ : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు అందించేందుకు సిద్ధంగా ఉందని కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులు రూ.50లు డీడీ చెల్లించి ఏడాది పాటు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. పాఠశాలల్లో చదివే 12 సంవత్సరాల లోపు బాలురు, 18 సంవత్సరాలలోపు బాలికలు ఉచిత బస్‌పాస్ సౌకర్యానికి అర్హులని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు శనివారం నుంచే బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలు, పాఠశాలలు తమ విద్యా సంస్థ నుంచి విద్యార్థుల కోర్సుల వివరాలు, తరగతులు నమోదు లేదా రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు కొత్తవాటికి రూ.7000లు, రెన్యువల్‌కు రూ.6000లు, డిగ్రీ కొత్త కళాశాలలకు రూ.6000లు, రెన్యువల్‌కు రూ.5000లు, జూనియర్ కళాశాలలో డిప్లమా, ఐటీఐ కళాశాలల్లో కొత్తవాటికి రూ.5000లు. రెన్యువల్‌కు రూ.4000లు, ప్రైవేటు స్కూళ్లకు కొత్త వాటికి రూ.2000లు, రెన్యువల్‌కు రూ.1500లు, గ్రామీణ ప్రాంతల్లో ప్రైవేటు స్కూళ్లకు కొత్తవాటికి రూ.1000లు, రెన్యువల్‌కు రూ.1000లు అన్ని జాతీయ బ్యాంకుల్లో చెల్లుబాటు అయ్యే డీడీ రూపంలో చెల్లించాలని, డీడీతో పాటు పాఠశాల వివరాలను ఆర్టీసీ బస్సు పాసు కౌంటర్‌లో అందజేయాలని ఆయన కోరారు. ప్రైవేటు విద్యా సంస్థలు బస్‌పాస్‌ల వివరాల కోసం సెల్ నెంబర్లు 7382833303, 7382833498, 7780433533ను సంప్రదించాలని చెప్పారు.

సైదులుకు నివాళి

గరిడేపల్లి : సీపీఎం యువనేత అమ్మనబోయిన సైదులు అకాల మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం నాయకుడు, సింగిల్ విండో డైరెక్టర్ ములుగుండ సుధాకర్‌రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కట్టబోయిన గంగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కలమలచెరువు గ్రామంలో సైదులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ ఎంపీటీసీ అమ్మనబోయిన ముత్తయ్య, ఒట్టె గంగయ్య, అమ్మనబోయిన నవీన్, కట్టెబోయిన సైదులు, చిలకమర్రి అరవింద్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి మార్కుల పత్రాన్ని అందజేస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి

గరిడేపల్లి : ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో గరిడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. 10వ తరగతిలో 32 మంది విద్యార్థులకు 32 మంది ఉత్తీర్ణత సాధించారని ఇంటర్మీడియట్‌లో 48 మంది విద్యార్థులకు 37 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణత సాధించిన మేకపోతుల తేజగౌడ్‌కు మార్కులపత్రాన్ని అందజేసి అభినందించారు.

యల్లాపురంలో తాగునీటి కష్టాలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పాలకవీడు : మండలంలోని యల్లాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో గ్రామంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా ఎస్సీ కాలనీలో తాగటానికి, ఇంటి అవసరాలకు నీరు సరఫరా కావడంలేదని తెలిపారు. ఈ విషయాన్ని సర్పంచ్, కార్యదర్శులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు.

బూరుగడ్డలో సహస్ర కుంకుమార్చన



సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీ ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో శుక్రవారం సహస్ర కుంకుమార్చనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చనలు, సేవాకాలం, అలంకరణ, మంగళాశాసనం, తదితర కార్యక్రమాలను శాస్త్రకంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, యరగాని కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణ, తలంబ్రాలతో వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు పద్మనాబాచార్యులు, లక్ష్మీ నరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

నాగారం : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన సంఘటన ఈటూరులో శుక్రవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఈటూరు గ్రామానికి చెందిన రైతు కన్నెబోయిన రాములు రోజు వారిగానే తన పశువులను వ్యవసాయక్షేత్రంలోకి మేతకు తోలుకెళ్లాడు. ఎద్దు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.65 వేల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

క్లుప్తంగా

కేజీబీవీ అభివృద్ధికి 'మైహోం' సహకారం



రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న మైహోం పరిశ్రమ ప్రతినిధి శ్రీనివాసరావు

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెం వద్ద గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ)లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థానిక మైహోం సిమెంట్స్ పరిశ్రమ రూ.5 లక్షలు మంజూరు చేసింది. శుక్రవారం పరిశ్రమ ప్రెసిడెంట్ వర్క్స్, యూనిట్ హెడ్ ఎన్.శ్రీనివాసరావు రూ. 5 లక్షల చెక్కును పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి, స్థానిక సర్పంచ్ బేత కల్పనావీరనాగిరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద నిధులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు జీఎం డాక్టర్ నాగేశ్వరరావు, అడ్వైజర్ జగన్నాథరావు, మైన్స్ జీఎం శ్రీనివాసరావు, రత్నం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన ఉత్సవాలు

చిలుకూరు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సావాలలో భాగంగా శనివారం మండలంలోని దూదియాతండా గ్రామంలో నిర్వహించబోయే మండల స్థాయి గిరిజన ఉత్సవాలలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ గ్రామ సర్పంచ్ బాణోతు నందలాల్ కోరారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజన ఉత్సవానికి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ముఖ్య అతిథిగా హాజరు అవుతారని తెలిపారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

చిలుకూరు : ఫిట్‌నెస్ లేని ప్రైవేటు బస్సులను నడుపుతున్న పాఠశాల యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్టా నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను బస్సుల్లో ఇష్టానుసారంగా ఎక్కిస్తున్నారని, విద్యార్థులను తీసుకెళ్లే బస్సులను ఆర్‌టీఏ అధికారులు తనిఖీ చేసి ఫిట్‌నెస్ ఉన్నవాటికే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని, సంబంధిత యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలన్నారు.

పీవైఎల్ మహాసభల కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కోదాడఅర్బన్ :సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 24న నిర్వహించబోయే ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) మహాసభను విజయంతం చేయాలని పీవైఎల్ రాష్ట్ర నాయకుడు డి.రవి పిలుపునిచ్చారు. శుక్రవారం కోదాడలోని లాల్ బంగ్లాలో మహాసభల కరపత్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలు, పాలక వర్గాలు అవలంబిస్తున్న ప్రజా ప్రతిరేక విధానాలపై చేయవలసిన పోరాటాలు, ఉద్యమ కర్తవ్యాలను ఈ మహాసభలలో నిర్దేశించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ డివిజన్ అధ్యక్షుడు కామల్ల అనంతరామయ్య, నాయకులు నాగరాజు, బ్రహ్మం, సైదులు, సురేష్, కొండలు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డాక్టర్‌కు సన్మానం



డాక్టర్ సుధాకర్‌నాయక్‌ను సన్మానిస్తున్న స్పందన యూత్ సభ్యులు

మఠంపల్లి : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌నాయక్ ఉత్తమ డాక్టర్ అవార్డు పొందారు. దీంతో శుక్రవారం మండలంలోని కొత్తతండా స్పందన యూత్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్పందన యూత్ అధ్యక్షుడు బానోతు భరత్‌నాయక్, హైకోర్టు అడ్వకేట్ కిషన్‌నాయక్, యూత్ నాయకులు నాగచైతన్యనాయక్, బాబునాయక్, సైదానాయక్, నర్సింహనాయక్ ఉన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు

నడిగూడెం : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో గల టీడీపీ కార్యాలయంలో శుక్రవారం స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నార్కెట్‌పల్లి కామినేని ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 42 మందిని కంటి శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ జనరల్ మేనేజర్ గడ్డం సాంభశివరావు, డైరెక్టర్ గుద్దేటి సామ్యేలు, కామినేని వైద్యశాల వైద్య బృందం, నాయకులు గుండు నాగేశ్వరరావు, దొంతగాని శ్రీనివాస్, దేవరంగుల వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

సర్వమతాల ఆరాధ్యదైవం జాన్‌పహాడ్ సైదన్న

• ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



జాన్‌పహాడ్ దర్గాలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు : మండలంలో జాన్‌పహాడ్ దర్గాను శుక్రవారం నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డిలు పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. బాబా సమాదులపై చాదర్ దట్టీలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. సర్వమతాల ఆరాధ్య దైవం, మహిమగల దేవుడు జాన్‌పహాడ్ సైదన్న అని ఆయన అన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా గోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, పాలకవీడు మండల అధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బారావు, శివారెడ్డి, మోతీలాల్, కాంగ్రెస్ పార్టీ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌రూరల్ : మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రగతి నివేదికల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గోపాలపురం ఎంపీటీసీ చీకూరి రాజారావు మాట్లాడుతూ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో అధికారులను నిలదీశారు. అలాగే కృష్ణ, గుంటూరు జిల్లాల నుంచి వచ్చే బయో కంపెనీ మందులను నివారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శాంతకుమారి, వైస్ ఎంపీపీ సింగతల సైదమ్మ, సర్పంచ్‌లు అన్నెం శిరీషాకొండారెడ్డి, కీత జయమ్మధనమూర్తి, రమయ్యనాగరాజు, సుజాత, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఇళ్లు కట్టిస్తా

• ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



ఆకుపాములలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల : మండలంలోని ఆకుపాములలో ఇటీవల గ్యాస్ లీకై ఇల్లు కాలిపోయిన ఘటనలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆకుపాములలో బాధితుడు దొంతగాని శ్రీనును పరామర్శించి తక్షణ ఆర్థిక సాయం కింద రూ.పదివేలు అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీను కుటుంబానికి తన సొంత నిధులతో ఇల్లు కట్టించి ఇస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అందాల్సిన సహాయాన్ని వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. త్వరగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఇందుకోసం సర్పంచ్ సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కేసగాని వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ వి.రామిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కేసగాని నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పోలంపల్లి వీరు, గ్రామపెద్దలు వెంకటేశ్వర్లు, కాసాని వెంకటనారాయణ, షేక్ రషీద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతికి సంతాపం



నడిగూడెం : బస్విరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిప్పిరెడ్డి బస్విరెడ్డి (93) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్.. బస్విరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, చాకిరాల సర్పంచ్ యాతాకుల వీరస్వామి, వివిధ పార్టీల నాయకులు గుజ్జ అంజి, గోవిందు, వెంకటేశ్వరరెడ్డి, హనుమారెడ్డి, అల్వాల రామారావు, తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వరశర్మ మృతి బాధాకరం

• ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



వెంకటేశ్వరశర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

మేళ్లచెరువు : వెంకటేశ్వరశర్మ మృతి బాధాకరమని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా అర్చక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, శివాలయం మాజీ ప్రధానార్చకుడు కొంకపాక వెంకటేశ్వరశర్మ సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ శంకర్‌రెడ్డి, బోగాల బాల వెంకటరెడ్డి, రాధాకృష్ణమూర్తి ఉన్నారు.

దాంపత్య వ్రతం కరపత్రం ఆవిష్కరణ



నేరేడుచర్ల : దాంపత్య వ్రతం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : నేరేడుచర్లలోని ఎస్‌కేఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించబోయే శ్రీవేణుదత్తా సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రత హోమం, కలశ పూజ కరపత్రాలను శుక్రవారం నేరేడుచర్లలో ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రామదూత సభ్యులు కొణతం మాధవరెడ్డి, చిలకమర్రి శ్రీనివాసాచారి, కొప్పు లక్ష్మీనారాయణ, గుండ్ల రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సుందరంగా గాంధీ పార్క్

• రూ.20 లక్షలతో ఆధునీకరించిన మున్సిపాలిటీ అధికారులు
• ఆనందం వ్యక్తం చేస్తున్న కోదాడ పట్టణవాసులు



ఆధునీకరించిన గాంధీ పార్క్

కోదాడ : చెత్తకుప్ప కన్నా అధ్వానంగా ఉన్న గాంధీ పార్క్‌ను ఎట్టకేలకు మున్సిపాలిటీ అధికారులు సుందరంగా తయారు చేశారు. గాంధీ పార్క్ దుస్థితిపై ×సాక్షి¥ వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి బాగు చేశారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా కోదాడ మున్సిపాలిటీ అధికారులు ఈ పార్క్ అభివృద్ధికి రూ. 20 లక్షలు కేటాయించి, నెల రోజుల క్రితం పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభించి ఇటీవల పూర్తి చేశారు. తాజాగా దీన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి అనువుగా తీర్చిదిద్దారు. పార్కులో ఎండిపోయిన చెట్లను, పాడైపోయిన పరికరాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. పచ్చికను, పూల చెట్లను, చిన్నారులు ఆడుకోవడానికి వివిధ రకాల పరికరాలను, ఆట వస్తువులను ఏర్పా టు చేశారు. గోడలపై చిన్నారులను ఆకట్టుకునేలా చిత్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పార్క్ సందర్శనకు చిన్నారులతో పాటు పెద్దలు కూడా వస్తున్నారు.

ఆక్రమణలో పార్క్...

కాగా, దాదాపు 80 వేల మంది జనాభా ఉన్న కోదాడ పట్టణంలో ఒక్కటంటే ఒక్క పార్క్ లేదంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. గత నెలలో పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తమ్ పద్మావతినగర్‌లో పార్క్‌ను ప్రారంభించారు. కానీ అక్కడికి వెళ్లాలంటే బైపాస్ రోడ్డు దాటాల్సి ఉంటుంది. దీంతో ప్రజలు సేద తీరడానికి పార్క్‌ల కొరత తీవ్రంగా ఉంది. పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీ పార్క్ ఆక్రమణకు గురికావడంతో అది చిన్నదిగా మారిపోయింది. కరోనాకు ముందు ఇక్కడ ఐదు లక్షల రూపాయలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అయితే నాసిరకం పరికరాలు ఏర్పాటు చేయడంతో కొద్ది రోజులకే అవి శిథిలావస్థకు చేరి పనికిరాకుండా తయారయ్యాయి. దీనికి తోడు సమీపంలో ఉన్న పూల దుకాణాల వ్యాపారులు దీన్ని పార్కింగ్ స్థలంగా వాడుకుంటున్నారు.

నిర్వహణ సక్రమంగా ఉండాలి



పట్టణంలోని గాంధీ పార్క్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయం. దీని నిర్వహణ సక్రమంగా ఉండాలి. పార్క్ లోపల వాహనాలు పార్కింగ్ చేయకుండా, చెత్త వేయకుండా చూడాలి. పార్క్‌లో పచ్చిక, మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీరు పెట్టాలి. నిర్వహణకు ఒకరిని నిత్యం అక్కడ ఉంచితే పార్కు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతుంది.

– తాటి సత్యనారాయణ, కోదాడ